









జయ జయ హే మహిషాసురమర్దిని

రమ్యకపర్దిని శైలసుతే.!

- భక్తిశ్రద్ధలతో దేవీ శరన్నవరాత్రుల చివరి రోజు పూజలు
- మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చిన అమ్మవారు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆయా డివిజన్లలో కనులపండువగా జరుగుతున్నాయి. బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకున్నారు. నవమి సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చనలు, చండీహోమం, సహస్రనామార్చనలు నిర్వహించారు. పూజలతో ఆలయాల పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతున్నాయి. దేవీ శరన్నవరాత్రుల చివరి రోజు కావడంతో ఆలయాలు, మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. బుధవారం (నవమి) అమ్మవార్లను మహిషాసురమర్దినిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. గురువారం దసరా వేడుకలను పురస్కరించుకొని ఆలయాల్లో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం కార్యాలయాలు, దుకాణాలు ఆయుధ పూజకు ముస్తాబవుతూ కనిపించాయి.

– సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ జోన్ బృందం


రాంగోపాల్‌పేట్: మహిషాసురమర్దినిదేవీ అలంకారంలో మహంకాళి అమ్మవారు


మహిషాసురమర్దిని దేవీగా కనకదుర్గా అమ్మవారు


మహిషాసురమర్దిని అలంకారంలో బేగంపేట శ్రీకట్టమైసమ్మ


ఎల్లమ్మ సన్నిధిలో బండారు దత్తాత్రేయ


ఎస్‌ఆర్‌నగర్‌లో పూజలు చేసిన ఎమ్మెల్యే తలసాని యాదవ్



లాలాపేటలోని భాగమతి పోచమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు


ఎల్లమ్మ ఆలయంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేశ్


ఎల్లమ్మను దర్శించుకున్న దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి


బౌద్ధనగర్: అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎంటమాలజీ సిబ్బంది


పూజలు చేసిన స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి


ఎస్‌ఆర్‌నగర్ మండపంలో పూజలు చేసిన వెల్లాల రాంమోహన్


హమాల్‌బస్తీలోని నల్లపోచమ్మ దేవాలయంలో..



భక్తిశ్రద్ధలతో రథోత్సవం



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ శివాజీనగర్‌లోని వేంకటేశ్వర పెరుమాల్ ఆలయంలో బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. బుధవారం స్వామివారి రథోత్సవం కన్నుల పండువగా స్వామివారి పాటలు, భజనలతో సికింద్రాబాద్ పురవీధుల్లో సాగగా.. వందలాది మంది భక్తులు, ఎమ్మెల్యే శ్రీగణేశ్ తదితర నాయకులు రథోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 200 ఏళ్ల పైబడిన పురాతన స్వామివారి దేవాలయంలో అత్యంత వైభవంగా ఉత్సవాలు జరగడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు. ఇలాంటి స్వామివారు తన నియోజకవర్గంలో నెలకొనడం తన అదృష్టమని అన్నారు. ఎమ్మెల్యేతో పాటు నాయకులు వెంకట్రాజు, శేఖర్ ముదిరాజ్, నాగేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

మాదకద్రవ్యాల నిరోధానికి ప్రభుత్వం బహుముఖ చర్యలు

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి

రాంగోపాల్‌పేట్: రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నిరోధానికి బహుముఖ చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం సికింద్రాబాద్ జింఖానా మైదానంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సే నో టు డ్రగ్స్ పేరుతో నిర్వహించిన లక్ష బెలూన్ల ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ వినూత్న ఆలోచన సమాజానికి అవగాహన కల్పించేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నేటి సమాజంలో యువత డ్రగ్స్‌కు ఎక్కువ బానిసలు అవుతున్నారని దీన్ని గుర్తించిన ప్రభుత్వం డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతుందని అన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలపై నిత్యం నిఘా పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్‌కు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

రోగి సహాయకురాలి అదృశ్యం


భూమమ్మ

గాంధీఆస్పత్రి: రోగి సహాయకురాలు అదృశ్యమైన ఘటన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో జరిగింది. చిలకలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా బూరుపల్లెకు చెందిన భూమమ్మ(50) గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుమారుని వద్ద రోగి సహాయకురాలిగా ఉండి సపర్యలు చేస్తుంది. గత నెల 28న ఉదయం 10.30 గంటలకు బయటకు వెళ్లిన భూమమ్మ తిరిగి వార్డుకు చేరలేదు. పలు ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో కుమార్తె భాగ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

డీసీఎం ఢీకొని బాలుడు మృతి


మృతి చెందిన సయ్యద్ జయాన్(10)

రాంగోపాల్‌పేట్: డీసీఎం వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఓ బాలుడు మరణించిన ఘటన రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు కథనం ప్రకారం.. బేగంపేట పాటిగడ్డకు చెందిన సయ్యద్ జావీద్ కుమారుడు సయ్యద్ జయాన్ (10) స్థానిక పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. ఇదే ప్రాంతంతో తన బంధువులు ఉంటారు. బుధవారం సాయంత్రం అబ్దుల్ రెహాన్, జయాన్‌ను తీసుకొని హోండా యాక్టివా ద్విచక్ర వాహనంపై పాటిగడ్డ నుంచి ఎంజీ రోడ్డులో పనిచేస్తున్న తన ఆంటీకి టిఫిన్ బాక్స్ ఇవ్వడానికి దుకాణానికి వచ్చాడు. టిఫిన్ బాక్స్ ఇచ్చిన తర్వాత మళ్లీ అదే ద్విచక్ర వాహనంపై పాటిగడ్డకు బయలుదేరారు. మార్గమధ్యలో ఎంజీరోడ్డులోని రాంగోపాల్‌పేట్ పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకోగానే డీసీఎం వాహనం వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్న సయ్యద్ జయాన్ డీసీఎం కింద పడటంతో అక్కడికక్కడే మరణించాడు. ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న అబ్దుల్ రెహాన్ కూడా గాయాలు కావడంతో వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు అబ్దుల్ రెహాన్ వివరాలు తెలియరాలేదని ఆస్పత్రి నుంచి కోలుకున్నాక తెలుస్తాయని తెలిపారు.



ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలి

– ఏసీపీ శశాంక్‌రెడ్డి

బౌద్ధనగర్: ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలని చిలకలగూడ ఏసీపీ శశాంక్‌రెడ్డి అన్నారు. బుధవారం వారాసీగూడలోని ఏసీపీ కార్యాలయంలో వారాసీగూడ, చిలకలగూడ, లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని మండప నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గామాత నిమజ్జనం వేడుకల్లో డీజేలకు అనుమతులు లేవన్నారు. భక్తిశ్రద్ధలతో నిమజ్జనం జరుపుకోవాలని, ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా సమయ పాలన పాటించాలన్నారు. అమ్మవారు ఊరేగింపు వీలైనంత తొందరగా ప్రారంభించేలా మండప నిర్వాహకులు ప్రయత్నించాలన్నారు. ఊరేగింపు సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచనలు అందజేశారు.

పారిశుద్ధ్య కార్మికుల ఆయుధ పూజ

లాలాపేట: దసరా పండుగ సందర్భంగా బుధవారం తార్నాక మున్సిపల్ డివిజన్ వ్యాప్తంగా ప్రజలందరూ ఆయుధ పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఇళ్లలోని వృత్తి పనిముట్లకు, వ్యాపారులు వారి పరికరాలకు, ప్రజలందరూ వారి వారి నిత్య జీవితంలో వాడుకునే వాహనాలను ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు తమ రోజు వారి విధుల్లో ఉపయోగించే పరికరాలు వీల్ బారెల్స్‌కి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ మంతపురి యాకయ్య, కార్మికులు మంగమ్మ, ప్రమీల, సుజాత, జ్యోతి, అనసూయ, సరోజ, యశోద, పద్మ, అనూష తదితరులు పాల్గొన్నారు.

